నిర్ణయం తీసుకున్న  తెలంగాణ కేబినెట్
= నాలుగు గంటల పాటు కేబినెట్ భేటీ
= కీలక అంశాలపై చర్చ
= రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీని ఆహ్వానం


సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

డిజిటల్

మంగళవారం, మే 21, 2024


తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :  జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. సోమవారం మధ్యాహ్నం ఈసీ షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన అనంతరం సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లపై కూడా కేబినెట్లో చర్చించారు. ఈ బాధ్యత పూర్తిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని ఆదేశాలు జారీ చేసింది. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేసింది.

- నాలుగు గంటల పాటు కేబినెట్ భేటీ
- కీలక అంశాలపై చర్చ
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీకి ఆహ్వానం
- ధాన్యం కొనుగోలు బాధ్యతను కలెక్టర్లకు అప్పగిస్తూ నిర్ణయం



# సన్నవడ్లకే రూ.500 బోనస్

నిర్ణయం తీసుకున్న కేబినెట్






రిపోర్టర్లు కావలెను

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి 'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక' ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి

సెల్: 99854 44342


## కాంగ్రెస్ బోనస్.. పెద్ద బోగస్

- సన్నవడ్లకే బోనస్ వెనక్కితీసుకోవాలి
- అన్ని రకాల వడ్లకు రూ. 500చెల్లించాలి
- మాజీమంత్రి హరీష్‌రావు

2 లో

# కాంగ్రెస్ బోనస్.. పెద్ద బోగస్

## మాజీమంత్రి హరీష్‌రావు



- సన్నవడ్లకే బోనస్ వెనక్కితీసుకోవాలి
- అన్ని రకాల వడ్లకురూ. 500 చెల్లించాలి

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఎన్నికల హామీని తుంగలో తొక్కిందని, బోనస్ అనేది పెద్ద బోగస్ అని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. నిరుద్యోగులకు నెలకు 4,000 రూపాయల భృతి ఇస్తామని హామీ ఇచ్చి, మేమా మాట అనలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు వడ్లకు బోనస్ ఇచ్చే విషయంలో కూడా పచ్చి అబద్ధం ఆడి, రైతులను మోసం చేసిందని ఆయన తెలిపారు. రైతులు పండించిన వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తాము పండించిన పంటను అమ్మకానికి సిద్ధపడి బోనస్ కోసం ఎదురు చూస్తుండగా, వారందరి ఆశలు అడియాసలు చేస్తూ కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని, అది కూడా వచ్చే సీజన్ నుంచి ఇస్తామని మంత్రులు ప్రకటించడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను హరీష్ రావు విడుదల చేశారు. రాష్ట్రంలో దాదాపు 90 శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, పది శాతం పండే సన్న వడ్లకు మార్కెట్లో మంచి డిమాండు ఉంటుందని, సన్న వడ్లకు మద్దతు ధర కంటే చాలా అధికంగా మార్కెట్లో ధర వస్తుంది. కానీ దొడ్డు రకం బియ్యానికే గిట్టుబాటు ధర రాదన్నారు. కాబట్టి బోనస్ ఇవ్వాల్సింది దొడ్డు రకం వడ్లకేనని ఆయన పేర్కొన్నారు. అలా కాకుండా కేవలం సన్న రకాలకే బోనస్ ఇస్తాం, అదీ వచ్చే సీజన్ నుంచి ఇస్తామనడం రైతులను దగా చేయడమే అవుతుందని ఆయన తెలిపారు. తాజాగా మంత్రుల ప్రకటనతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల, వ్యవసాయాభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టమైపోయిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో ఇచ్చినవే తప్ప రైతుల మేలు కోసం చేసే కార్యక్రమాలు కావని తేలిపోయిందని పేర్కొన్నారు. ఎకరానికి రూ.15,000 రైతు భరోసా సాయం ఇస్తామని, వ్యవసాయ కూలీలకు 12వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామనే హామీలను కూడా ప్రభుత్వం ఇప్పటి దాకా అమలు చేయని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానని అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ గురించి కూడా వాయిదాలు పెట్టడమే తప్ప నేటి వరకు అమలు చేసింది లేదని ఆయన ఆరోపించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సీజన్ నుంచే అన్ని రకాల వడ్లకు 500 చొప్పున బోనస్ చెల్లించాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# పనులు పూర్తి చేయాలి

**అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరమ్మతు పనులపై సమీక్షలో కలెక్టర్ అనురాగ్ జయంతి**

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఆయా స్కూళ్ళలో మరమ్మతు పనులు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేయాల్సిన మరమ్మతు పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాలులో జిల్లాలోని ఈఈలు, ఎంపీడీఓలు, ఏఈలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కూళ్ళలో నీటి సరఫరా, విద్యుత్ పరికరాల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతు, నీటి సదుపాయం, పాఠశాలల ఆవరణలో మరమ్మతు తదితర పనులపై ఆయా మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఎన్ని స్కూళ్ళలో పనులు మొదలు పెట్టారు? ఎన్ని పూర్తి అయ్యాయో చర్చించారు. పనులు నాణ్యతతో చేయించాలని, ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈఓ రమేష్ కుమార్, టీఎస్ఈ డబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, డీపీఓ వీర బుచ్చయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీరాజ్‌లో అవినీతి చేప

- రూ.7వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ ఏఈ
- ధైర్యంగా సమాచారం ఇవ్వండి : ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** అసలే చేసిన పనులకు బిల్లు రాక ఏళ్ళ తరబడి తిరిగి తిరిగి వేసారి పోతున్న కాంట్రాక్టర్లకు అధికారుల అవినీతి మరింత తలనొప్పిగా మారింది. స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మించిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం పంచాయతీ రాజ్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయాడు. బిల్లులు పై అధికారులకు పంపాలంటే 8వేల రూపాయలు లంచం ఇస్తేనే పనవుతుందంటూ పంచాయతీరాజ్ ఏ.ఈ ,తెలపడంతో చిరకు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం రోజున కలెక్టరేట్లోని పంచాయతీరాజ్ విభాగంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి కాంట్రాక్టర్ నుండి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ వెంకటేష్ బిల్లుల కోసం పంచాయతీరాజ్ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. నాలుగు నెలల క్రితం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మొత్తం పంచాయతీరాజ్ ఎ, ఈ,భాస్కర్ రావుకు అందజేశారు. ఏ ఈ,భాస్కర్ రావు ఎనిమిది వేల రూపాయలు లంచం ఇస్తేనే ఎంబి చేస్తానంటూ తెలపడంతో నివ్వెర పోయిన కాంట్రాక్టర్ వెంకటేష్ అంత ఇచ్చుకోలేనంటూ బతిమిలాడడంతో రూ.7వేలు తగ్గించాడు. తన వేధిస్తున్న అధికార తీరుపై ఏసీబీ అధికారులకు వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో కలెక్టరేట్ సముదాయంలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో దాడులు నిర్వహించిన అధికారులు 7వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏఈ , భాస్కర్ రావును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. భాస్కరరావును ఏసీబీ కోర్టులో హాజరు పరుచున్నట్లు ఉన్నట్లు ఏసీబీ డిఎస్పి రమణమూర్తి తెలిపారు. అధికారులు లంచం కోసం వేధిస్తే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన చర్చ నిమిషం గా మారింది.



# రానున్న మూడు రోజుల్లో వర్షాలు



**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళఖాతంలో ఈనెల 22వ తేదీ నాటికి ఒక అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది వ్యాయువ్య దిశలో కదిలి ఈనెల 24 నాటికి మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తెలంగాణలోని కొన్ని జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఈనెల 21న కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, జోగులాంబ తదితర జిల్లాల్లో వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

### తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్ మెన్ మత్య విభాగం

# వరంగల్ జిల్లా చైర్మన్‌గా సారంగపాణి



**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్ మెన్ మత్య విభాగం వరంగల్ జిల్లా చైర్మన్‌గా గుడిబోయిన సారంగపాణి గంగపుత్ర నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశములో వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన గుడిబోయిన సారంగపాణి గంగపుత్రను కాంగ్రెస్ నియమించింది. నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి గంగపుత్ర సారంగపాణికి అందచేశారు. ఈ సందర్భంగా గుడిబోయిన సారంగపాణి గంగపుత్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర, తెలంగాణ ఫిషర్ మె న్ కాంగ్రెస్ చైర్మెన్ మెట్టు సాయి గంగపుత్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వర్ధన్నపేట శాసన సభ్యుడు నాగరాజు సహకారముతో మత్యకారులకు రాష్ట్ర ప్రభుత్వము అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.






# మాపై దుష్ప్రచారం చేస్తున్నారు : కేటీఆర్

- కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ప్రజలకు అర్థమయింది
- పదేళ్ల కాలంలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం
- మేము చేసిన పనులకు ప్రచారం చేసుకోలేకపోయాం

**తెలంగాణ ప్రభ, కొత్తగూడెం** : గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ – నల్గొండ – ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో జరిగిన ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరు నెలల కాలంలోనే ప్రజలకు పూర్తిగా అర్థమయిపోయిందని చెప్పారు. ఉపాధి కల్పన కోసం తాము ఎంతో కృషి చేశామన్నారు. పదేళ్ల కాలంలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలో కూడా పదేళ్ల కాలంలో ఈ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరగలేదని చెప్పారు. తెలంగాణలో సాగునీటికి, తాగునీటికి, విద్యుత్ కు లోటు లేకుండా చేశామన్నారు.

తాము చేసిన పనులపై ఎక్కువగా ప్రచారం చేసుకోలేకపోయామని చెప్పారు. అదే బీఆర్ఎస్ కు మైనస్ పాయింట్ అయిందని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై సరిగా ప్రచారం చేసుకోకపోవడం తమ తప్పే అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని... త్వరలోనే తమ పార్టీ పూర్వ వైభవం పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రం బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొందని చెప్పారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఓ విద్యావంతుడు పోటీ చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ తరపున ఓ బ్లాక్ మెయిలర్ పోటీ చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఇప్పుడు మనకు కావాల్సింది ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులు.. ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతులు కాదన్నారు. మనకు కావాల్సింది ధిక్కార స్వరాలు.. అధికార స్వరాలు కాదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతుకను చట్టసభకి పంపాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# విధులకు కోటగిరి ఏఎంసీ కార్యదర్శి గైరాజర్

**తెలంగాణ ప్రభ (కోటగిరి)** : కోటగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గత నాలుగు రోజుల నుండి కార్యదర్శి శ్రీనివాస్ విధులకు రావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో 11:30 కు వెళ్లి చూడగా కార్యదర్శి కూర్చి ఖాళీగా ఉండటంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఏఎంసి కార్యాలయ సిబ్బంది టైం పాలన పాటించకపోవడంపై రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలువక రైతులు లబోదిబోమని అంటున్నారు .రైతులు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గోదములో నిలువ ఉంచిన వరి ధాన్యం అప్ప చెప్పాలని ఎన్నిసార్లు కార్యదర్శికి మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని రైతులు తెలిపారు .ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేసే మాటలు చెబుతున్నాడని రైతులు మండిపడ్డారు. జిల్లా అధికారులు పలుమార్లు కార్యాలయానికి వచ్చి తనిఖీలు చేపట్టిన ఏఎంసీ కార్యదర్శి మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరించడంపై రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోదాంలో ఉన్న వరి ధాన్యాన్ని అప్పజెప్పే విధంగా కార్యదర్శి జిల్లా అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని రైతులకు కోరారు. జిల్లా కలెక్టర్ ఏఎంసి కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యదర్శి విధులకు గైరాజర్ కావడంతో విచారణ చేపట్టి అతనిపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.








# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

## ఎస్సై డి.సుధాకర్

**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి)** : మండలంలో గతంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని సోమవారం సిరిసిల్ల మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై డి.సుధాకర్ తెలిపారు.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల మేజిస్ట్రేట్ ఒక్కరికీ రూ.2000, ఏడుగురికి రూ.1500 చొప్పున మరియు 13 మందికి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.25500 రూపాయల జరిమానా విధించడం జరిగిందని ఎస్ఐ డి.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఘనంగా బీరప్ప కళ్యాణం

## పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**తెలంగాణ ప్రభ (నర్సాపూర్)** : నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆత్మూరు మండల పరిధిలోని సికిందపూర్ గ్రామంలో సోమవారం బీరప్ప కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరగబోయే ఈ బీరప్ప కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి రావడం జరుగుతుందని ఆమె తెలిపారు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ బీరప్ప స్వామి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు మాణిక్యరెడ్డి, శ్రీకాంత్, మాజీ ఉపసర్పంచ్ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు వీరేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

